సాక్షి
వరంగల్
శనివారం । 26 । అక్టోబర్ । 2024



రైల్వే హబ్..కాజీపేట
రైల్వే ప్రాజెక్టులు, మూడో రైల్వే లైన్, రైల్వే యూనిట్ల కార్యాలయాలతో కాజీపేట రైల్వే హబ్‌గా మారనుంది. - 10లో▸



అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి
విద్యార్థులు సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలని రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. - 10లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం $32^0/21^0$
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

కాళోజీ సెంటర్: కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ప్రజావాణిలో దివ్యాంగులు, వయోవృద్ధులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

కాళోజీ సెంటర్: సెలవుపత్రాల్లో సాంకేతిక తప్పులను ఎత్తిచూపుతూ, సెలవు తీసుకోవడానికి వీలు లేదని వర్ధన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులను డీఈఓ సస్పెండ్ చేయడాన్ని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందని అధ్యక్షుడు ఎ.గోవర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.యాకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని వారు పేర్కొన్నారు.

చేతిపంపులను మరమ్మతు చేయాలి



చెన్నారావుపేట: చేతిపంపుల మరమ్మతుపై అవగాహన పెంచుకోవాలని వరంగల్ డివిజన్ మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మూడో రోజు శుక్రవారం గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతులు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చేతిపంపులకు మరమ్మతులు చేసి సురక్షితమైన తాగునీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట సబ్ డివిజన్ డీఈఈ దేవేందర్‌రెడ్డి, చెన్నారావుపేట ఇంట్రా ఏఈఈ రణధీర్, గ్రిడ్ ఏఈఈ వంశీ, ఎంపీఓ శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక



రుద్రం కిశోర్

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థి నేవీ అగ్నివీర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సైనిక్ స్కూల్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుద్రం కిశోర్ జూలైలో జరిగిన స్టేజ్–1రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో చెన్నైలో జరిగిన దేహదారుఢ్య, వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపిక ఉత్తర్వులను అందుకున్నట్లు పేర్కొన్నారు. ఒడిశాలోని ఇండియన్ నేవీలో నవంబర్ 7వ తేదీలోగా ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థి కిశోర్‌ను సైనిక్ స్కూల్‌లో అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసస్వామి, స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పలయ్య, వైస్ ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలను నిర్లక్ష్యం చేయొద్దు



చెన్నారావుపేట: రైతులు పంటలను నిర్లక్ష్యం చేయకుండా చీడపీడలు ఆశించినప్పుడు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పాపయ్యపేట శివారులో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, ఏఈఓలు తిరుపతి, కల్యాణి పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్: హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పరిశీలించారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. కళాశాలలో విద్యాబోధన, పరీక్షల నిర్వహణ విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారమే నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు.

తరగతులు షురూ

- నర్సంపేట వైద్య కళాశాలలో ఆన్‌లైన్ క్లాసులు
- స్టేట్ కోటాలో 43 మందికి 43 మంది ప్రవేశాలు
- ఆల్ ఇండియా కోటాలో ఏడుగురికి ఆరుగురు..
- అడ్మిషన్ తీసుకోని కేరళ విద్యార్థి



నర్సంపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాల

నర్సంపేట రూరల్: నర్సంపేటలోని వైద్య కళాశాలలో నాలుగు రోజుల క్రితం తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత 40 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులకు హాజరుకాగా.. శుక్రవారం 49 మంది హాజరయ్యారు. నూతన కళాశాల కావడంతో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు అధికారులు అన్ని వసతులు కల్పించనున్నారు. నర్సంపేట వైద్య కళాశాలకు నూతన భవనం కావడం, ఈ ఏడాది నుంచి తరగతులను సైతం ప్రారంభించడంతో వసతుల కల్పన కోసం అధికారులు కృషిచేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వైద్య కళాశాలను 50 సీట్లతో ప్రారంభించారు. ఆల్ ఇండియా కోటాలో ఏడుగురు విద్యార్థులకు సీట్లు కేటాయించగా ఆరుగురు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన విద్యార్థి మాత్రం అడ్మిషన్ పొందలేదు. మరో వారం రోజుల్లో ఆల్ ఇండియా చివరి కౌన్సెలింగ్ ఉండడంతో ఆ ఒక్క సీటు భర్తీ కానుంది. రాష్ట్ర కోటా కింద 43 మందికి కేటాయించగా 43 మంది అడ్మిషన్లు పొందారు. రాష్ట్ర కోటాలో సైతం చివరి కౌన్సెలింగ్ గురువారంతో ముగియగా నలుగురు విద్యార్థులు జాయిన్ అయ్యారు. మొత్తం కళాశాలలో 49 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో 20 మంది పురుషులు, 29 మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. వసతులు కల్పించి, అన్ని అనుమతులు రాగానే రెగ్యులర్ తరగతులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు బోధిస్తున్న ప్రొఫెసర్

ప్రతిరోజూ నాలుగు తరగతులు..

నర్సంపేట వైద్య కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను ఈనెల 22 నుంచే ప్రారంభించారు. తొలుత 40 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో తరగతులు వినాలని అధికారులు సూచించడంతో క్రమంగా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతూ వచ్చింది. ప్రతిరోజూ నాలుగు తరగతుల చొప్పున విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భోజన విరామం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తూ క్లాసులు తీసుకుంటున్నారు.

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో క్లాసులు..



నర్సంపేట వైద్య కళాశాలలో రాష్ట్ర కోటా చివరి కౌన్సెలింగ్ పూర్తి కావొచ్చింది. 49 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఆల్ ఇండియా కోటాలో ఒక విద్యార్థి అడ్మిషన్ పొందాల్సి ఉంది. అయితే, పాత వైద్య కళాశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడం ప్రారంభమైంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నాం. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తరగతులకు విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. అన్ని అనుమతులు ప్రభుత్వం నుంచి తీసుకుని త్వరలోనే ఆఫ్‌లైన్ తరగతులను సైతం ప్రారంభిస్తాం.

– మోహన్‌దాస్, ప్రిన్సిపాల్, నర్సంపేట వైద్య కళాశాల

మెమోలతోనే సరి!

- స్టాఫ్‌నర్సు, వైద్యుల నియామకాల్లో అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- నల్లబెల్లి పీహెచ్‌సీకి జూనియర్ అసిస్టెంట్ బదిలీ
- మరో ఇద్దరికి మెమోలతో సరిపెట్టారని ఆరోపణలు

సాక్షి, వరంగల్: జిల్లాలో స్టాఫ్‌నర్సు పోస్టులు, పల్లె దవాఖాన డాక్టర్ల నియామకాల్లో గోల్ మాల్ జరిగిందని స్పష్టమైనా.. చర్యల విషయంలో అనుకున్నంత వేగిరం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించగా.. సదరు అధికారులు ఆమెపై ముఖ్యుల నుంచి ఒత్తిడి తీసుకువచ్చారని జిల్లా వైద్య విభాగంలో జోరుగా చర్చ జరుగుతోంది. జూనియర్ అసిస్టెంట్ పృథ్వీని జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం నుంచి నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయగా.. మరో ఇద్దరు అధికారులకు మెమోలు ఇచ్చారని తెలిసింది. రోస్టర్ పద్ధతిలో బీసీ–ఏ, బీసీ–బీ ఇలా అటు ఇటు మార్చి మెరిట్ వచ్చేలా చూసి ఉద్యోగం ఇచ్చే ప్రయత్నం చేసిన ఈ ఘటనలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను టర్మినేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించినా కూడా ఆ దిశగా ఇంకా చర్యలు తీసుకోలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై అక్కడి అధికారులు మాట్లాడేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంకోవైపు ఉద్యోగార్థుల జీవితాలతో ఆటలాడిన ఈ అధికారులు తమ కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనన్న భయంతో కొందరు ముఖ్యుల నుంచి ఒత్తిడి తెచ్చి మెమోలతోనే సరిపట్టేలా చేశారన్న టాక్ ఉంది. మాకేం కాదు.. మమ్మలను ఎవరు ఏం చేయరంటూ వారు దర్జాగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో తిరగడం హాట్‌టాపిక్‌గా మారింది.

కీలక అధికారి విధులకు గైర్హాజరు..

బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న 15 స్టాఫ్‌నర్సు, ఎంబీబీఎస్ అర్హత ఉన్న ఆరు పల్లె దవాఖాన డాక్టర్ పోస్టుల విషయంలో కీలకంగా వ్యవహరించాల్సింది సదరు వైద్య విభాగం ఉన్నతాధికారే. ఆ తర్వాత ఆఫీస్ సూపరిండెంట్, జూనియర్ అసిస్టెంట్లు. అయితే రోస్టర్ పద్ధతిలో కంప్యూటర్‌లో డాటా తప్పుగా నమోదు చేయడంతోనే ఇదంతా జరిగిందని అసలైన వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒకటికి పదిసార్లు పరిశీలించుకున్న తర్వాతే కీలక అధికారులు నియామకాలకు మెరిట్ లిస్టులో ఉన్నవారిని పిలవాలి. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తప్పుచేశాడని, అతడిపై మాత్రమే చర్యలు తీసుకునే విధంగా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారని పలువురు పేర్కొంటున్నారు. ఈ పోస్టింగ్‌ల విషయంలో కీలకంగా ఉన్న ఓ అధికారి మూడు రోజుల నుంచి కార్యాలయంలో విధులకు హాజరు కావడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఓ అధికారిని నల్లబెల్లి పీహెచ్‌సీకి బదిలీ చేయడమేంటి అని, నియామకాల విషయంలో నిబంధనలను అతిక్రమిస్తే సస్పెండ్ చేయాలని వైద్య విభాగంలో చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నియామకాలపై లోతుగా విచారించి బాధ్యులైన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

నేడు కేయూలో సెమినార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని గణిత విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26న సెమినార్ నిర్వహించనున్నట్లు గణిత విభాగం అధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ భారవిశర్మ తెలిపారు. ఈసెమినార్‌లో 'గణితానికి సంబంధించిన లీనియర్ ఆల్జీబ్రా, పార్షియల్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్' అంశాలపై ప్రత్యేక చర్చ జరగనుందని పేర్కొన్నారు. ఈసెమినార్‌లో రిటైర్డ్ ఆచార్యులు వైఎస్.రెడ్డి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎస్.శర్మ సెషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈసదస్సుకు యూనివర్సిటీ పరిధి యూజీ పీజీ అధ్యాపకులతోపాటు పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కాపులకనిపర్తి ఉన్నత పాఠశాలలో ఇద్దరు వంట మనుషుల తొలగింపు
- ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని డీఈఓకు ఆదేశం



సంగెం : కాపులకనిపర్తి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

సంగెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, కొత్తగూడెంలోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీలు చేపట్టిన పనులను పరిశీలించారు. కాపులకనిపర్తి ఉన్నత పాఠశాలలో ఫిర్యాదుల బాక్సును తెరిచారు. 'కూర మంచిగా ఉంటేనే పాఠశాలలో తింటాం.. లేకుంటే ఇంటి నుంచి తెచ్చుకుంటాం' అని విద్యార్థులు రాసిన చీటిని చదివిన కలెక్టర్ వంట మనుషులు సరిత, ప్రమీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభారాణికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని డీఈఓకు చెప్పారు. పర్మనెంట్ కార్మికులు లేకపోవడంతో సమస్య వస్తున్నదని హెచ్‌ఎం కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే డీఆర్‌డీఏ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వంట కోసం పర్మనెంట్ కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. స్కావెంజర్లను నియమించుకుని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే చిట్టి రాసి ఫిర్యాదుల బాక్సులో వేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిచెన్‌గార్డెన్ పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎర్తింగ్ లేకుండా విద్యుత్ పనులు చేస్తే పని పూర్తి అయినట్లు సర్టిఫికెట్ ఇవ్వొద్దన్నారు. కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా.. ఒక ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు పంపించాలని ఆదేశించారు. పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని మండలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. డీఈఓ జ్ఞానేశ్వర్, ఏఎంఓ సుజన్ తేజ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కట్ర్యాల, వర్ధన్నపేట పాఠశాలల తనిఖీ..

వర్ధన్నపేట: కలెక్టర్ సత్య శారద శుక్రవారం మండలంలోని కట్ర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వర్ధన్నపేట ప్రాథమిక, ఉర్దూ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్ర్యాల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, వారి రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్ధన్నపేట ప్రాథమిక, ఉర్దూ పాఠశాలల విద్యార్థులతో మాట్లాడారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్వహణ లేకుండా ఉండడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీఓ వెంకటరమణ, అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశుగణన చేపట్టాలి

కాళోజీ సెంటర్: జిల్లాలో పశు గణాంకాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పశుగణన వాల్ పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శనివారం నుంచి నాలుగు నెలల పాటు (28 ఫిబ్రవరి 2025 వరకు) 21వ జాతీయ పశుగణన ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో 58 మంది పశుగణనకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 13 మండలాలు, 161 రెవెన్యూ గ్రామాలు, 70 మునిసిపల్ వార్డులు, పట్టణ ప్రాంతాల్లో పశుగణన జరుగుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,24,603 కుటుంబాలు, కార్పొరేషన్‌లో 1,17,982, మున్సిపాలిటీలో 17,936 కుటుంబాలను సర్వే చేసి, 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. పశుగణన ఆధారంగా నిధులతోపాటు వ్యాధి నివారణ మందులు సరఫరా అవుతాయని చెప్పారు. ప్రజలు, రైతులు గణన కర్తలకు సహకరిస్తూ కచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, జిల్లా నోడల్ అధికారి బాలజీ పాల్గొన్నారు.

విద్యార్థులను ఎంపిక చేసుకోవాలి

కాళోజీ సెంటర్: యువ టూరిజం క్లబ్‌ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషనల్, హెరిటేజ్ టూర్ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేసి టూరిజం అధికారి శివాజీకి ఇవ్వాలని ఆదేశించారు. డీఈఓ జ్ఞానేశ్వర్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, బీసీ సంక్షేమశాఖ అధికారి పుష్పలత, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన శాఖ అధికారి సత్యవాణి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి చివరి తేదీ 6

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా తయారీకి చివరి తేదీ నవంబర్ 6 అని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితా తయారీపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. డిసెంబర్ 30న ఓటరు తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం

- గత నెల 24న చేపట్టాల్సి ఉండగా.. నెలరోజుల అనంతరం ప్రారంభం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15,83,692 ఎకరాల్లో పంటల సాగు
- రెగ్యులర్ ఏఈఓలు 332, ఔట్ సోర్సింగ్‌పై 59 మంది



ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం, ఏఈఓల వివరాలు..

జిల్లా	సాగైన విస్తీర్ణం	రెగ్యులర్ ఏఈఓలు		ఔట్ సోర్సింగ్ ఏఈఓలు
		పురుషులు	మహిళలు	
హనుమకొండ	2,36,691	26	29	02
వరంగల్	2,84,568	28	31	05
మహబూబాబాద్	3,84,378	52	30	10
ములుగు	1,23,914	19	12	07
జేఎస్.భూపాలపల్లి	2,06,073	24	21	03
జనగామ	3,48,068	20	40	32

హన్మకొండ: పంటల సాగును కచ్చితంగా లెక్కించేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ఎట్టకేలకు ప్రారంభమైంది. అత్యంత కఠినమైన ఈ సర్వే చేయడం తమ ఒక్కరితో కాదని, సహాయకులను ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విస్తరణాధికారులు డిమాండ్ చేస్తూ నెల రోజులుగా సర్వేకు దూరంగా ఉన్నారు. ఇటీవల రైతు బీమాలో మార్గదర్శకాలు పాటించలేదని 165 మంది ఏఈఓలను సస్పెండ్ చేయడం ద్వారా వారిపై మానసికంగా వత్తిడి పెంచిన ప్రభుత్వం సర్వే చేసేలా చేసింది. సస్పెన్షన్‌పై ఆందోళన చేసిన ఏఈఓలతో చర్చించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విదేశాల నుంచి వచ్చిన తర్వాత ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని సర్వే చేపట్టాలని సూచించారు. దీంతో వారు సర్వే బాట పట్టారు. గత నెల 24 నుంచి చేపట్టాల్సిన సర్వే ఈనెల నుంచి మొదలైంది. మొబైల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పంటలు నమోదు చేస్తున్నారు. అయితే గ్రామాలకు దూరంగా ఉన్న పంట పొలాలకు తోడు లేకుండా వెళ్లి సర్వే చేయాలంటే మహిళా ఏఈఓలు జంకుతున్నారు.

391 మంది ఏఈఓలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 15,83,692 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 391 మంది ఏఈఓలు ఉండగా.. అందులో రెగ్యులర్ 332, ఔట్ సోర్సింగ్‌పై 59 మంది పనిచేస్తున్నారు. వీరందరిలో మహిళా ఏఈఓలు 163 మంది ఉన్నారు.

డైట్ టెండర్లలో రాజకీయం

- ఎంజీఎం అధికారులపై నాయకుల ఒత్తిడి

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో టెండర్ ప్రక్రియలో వివాదం సర్వసాధారణంగా మారింది. అవకతవకలు జరిగాయని ఆందోళనలు చేయడం.. కోర్టులకు వెళ్లడం ఎప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆస్పత్రిలో వైద్యసేవలు, వైద్య సిబ్బంది పనితీరు.. రోగులకు అందించాల్సిన మెడికల్, సర్జికల్ అలాగే ఆహారానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం కొనసాగించారు. 15 రోజుల క్రితం ప్రారంభమైన మెడికల్, సర్జికల్ టెండర్ ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే ఈనెల 14న ముగిసిన డైట్ కాంట్రాక్టు సమయం ప్రకారం ప్రక్రియ ప్రారంభించారు. 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి 25న టెండర్ ఓపెన్ చేస్తారు. ఈ సమయంలో వివాదం మొదలైంది.

అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో..

డైట్ టెండర్ షెడ్యూల్ ప్రకారం.. 17వ తేదీ నుంచి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. నిబంధనల ప్రకారం రూ.10 వేల డీడీతో 24వ తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తులను ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్‌లో సీల్ టెండర్ ద్వారా సమర్పించాలి. 25న డైట్ కమిటీ అధ్యక్షురాలైన అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో టెండర్లను ఓపెన్ చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు మూడు రోజుల సమయం పడుతుందని అధికారులు టెండర్‌దారులకు వివరించారు. డైట్ టెండర్లలో 10 మంది కాంట్రాక్టర్లు దరఖాస్తులు తీసుకోగా 9 మంది ప్రక్రియలో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.కాగా ప్రస్తుతం డైట్ టెండర్లలో పాల్గొన్న రెండు సంస్థలను తొలగించాలని శుక్రవారం ఐఎఫ్‌టీయూ నాయకులు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి వినతిపత్రం సమర్పించారు. అంతేకాకుండా ఎవరికి వారు టెండర్‌ను దక్కించుకునేందుకు అధికారులపై రాజకీయంగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. చివరకు మంగళవారం డైట్ టెండర్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందా లేదా చూడాలి.

వైద్యులు రారు.. సేవలు అందించరు!

- వర్ధన్నపేట ఆస్పత్రిలో అందుబాటులో లేని డాక్టర్లు
- గర్భిణిని వరంగల్ సీకేఎం వైద్యశాలకు పంపించిన సిబ్బంది
- మార్గమధ్యలోనే సాధారణ ప్రసవం



అంబులెన్సులో ప్రసవం అయిన నాగమణి, శిశువుతో సిబ్బంది

వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి. వైద్యులు హాజరు వేసుకుంటూ ప్రైవేట్ క్లినిక్‌ల్లో వైద్యం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వైద్యసేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన మహిళను వరంగల్ సీకేఎం ఆస్పత్రికి పంపించిన ఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 39 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా ఒక్క డాక్టర్ కూడా రోగులకు వైద్య సేవలు అందించడానికి అందుబాటులో ఉండని విచిత్ర పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర నాగమణి పురిటినొప్పులతో గురువారం అర్ధరాత్రి అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చింది. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది పరీక్షలు చేశారు. ఉమ్మ నీరు తక్కువగా ఉంది.. శిశువు మోషన్ మింగింది.. డాక్టర్ వస్తే చూస్తారని తెలిపారు. ప్రసవం కావడానికి సైతం దారి సరిగాలేదని, శిశువుకు అత్యవసర వైద్యం అందించేందుకు ఈ ఆస్పత్రిలో పరికరాలు లేవని వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యులకు సమాచారం అందించి పిలిపించాలని కోరగా వారు ఆపరేషన్ అయితేనే వస్తారని సిబ్బంది బదులిచ్చారు. దీంతో రాత్రి 2 గంటల సమయంలో 108లో వరంగల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో పంతిని వద్ద నాగమణికి తీవ్రమైన పురిటి నొప్పులు వచ్చాయి. అంబులెన్సులోని టెక్నీషియన్లు అప్రమత్తమై ఆమెకు ప్రసవం చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు శిశువు మోషన్ ఏమి మింగలేదని తెలిపారు. విధులకు హాజరుకాని వైద్యులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని నాగమణి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కాగా, ప్రసవం చేసిన 108 అంబులెన్స్ పైలట్ ఎల్లాగౌడ్, మెడికల్ టెక్నీషియన్ సదానందంను పలువురు అభినందించారు.

ఎంజీఎం ఆస్పత్రిలో తనిఖీ

ఎంజీఎం: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు నియమించిన కమిటీ సభ్యులు శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. మహేశ్వరం జనరల్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ నాగేందర్, జనగామ కళాశాలకు చెందిన సీవీ.శారద, సిద్దిపేట కళాశాల డైరెక్టర్ విమల థామస్ ఎంజీఎం ఆస్పత్రితో పాటు సీకేఎం, జీఎంహెచ్, టీబీఆర్‌ఈహెచ్ ఆస్పత్రులను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా ఆస్పత్రుల్లో వైద్య సేవలు పరిశీలించారు. ప్రధానంగా ఎంజీఎం ఆస్పత్రిలో ప్రతీ విభాగాన్ని వార్డులను, వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఆయా కాంట్రాక్టర్ల పనితీరు, సిబ్బంది వివరాలపై సైతం ప్రత్యేక ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరికరాలు, ఏయే పరికరాలు కావాలి అని అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఏఎన్ఎం కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో రెండు సంవత్సరాల ఏఎన్ఎం కోర్సులో శిక్షణకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 18 సంవత్సరాలు నిండి ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మహిళా అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ హైదరాబాద్ పేరు మీద రూ.200 డీడీ తీసి www.chfw.telangana.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు 7660022525 నంబర్‌లో సంప్రదించాలని మేనేజర్ జయశ్రీ సూచించారు.

28న 'నిధి ఆప్కే నిఖత్ -2.0'

హన్మకొండ అర్బన్ : ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ద్వారా అందించే సేవలు, వారి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా జిల్లాల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ -2, ఓబీసీ ఎస్.థానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని దక్షిత సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్స్ ప్రై లిమిటెడ్, పంథిని, హనుమకొండలోని మాంటిసోరి హైస్కూల్, ఎల్లాపూర్, మహబూబాబాద్‌లోని విద్యా హర్ప్స్ ప్రైవేట్ లిమిటెడ్, మరిపెడ, జనగామలోని జనగామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, ఘన్‌పూర్, జయశంకర్ భూపాలపల్లిలోని గణపతి హైస్కూల్, ములుగులోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఈ అవగాహన సదస్సు, సమస్యల పరిష్కార కార్యక్రమం ఉంటుందని, సభ్యులు ఎక్కువ సంఖ్యలో హాజరై తమ సందేహాలు, సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

అదుపు తప్పిన బైక్.. మహిళ మృతి

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని అగ్రంపహాడ్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంద సునీత (50) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గురువారం కూలీ పనికి వరంగల్‌కు వెళ్లిన సునీత.. ఇదే గ్రామానికి చెందిన పరికి కిషన్ బైక్ పై స్వగ్రామం వస్తోంది. ఈ క్రమంలో అగ్రంపహాడ్ సమీపంలో బైక్ అదుపు తప్పగా వెనుక కూర్చున్న సునీత రోడ్డుపై పడింది. దీంతో తీవ్ర గాయాలుకావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి మల్లికాంబ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే హబ్.. కాజీపేట

- ఒక వైపు వ్యాగన్ తయారీ పరిశ్రమ
- మరో వైపు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్ అప్ గ్రేడ్
- పట్టాలెక్కిన జిల్లా ప్రజల ఆశలు
- పరిశ్రమలతో నిరుద్యోగులకు ఊరట
- చిన్న పరిశ్రమలకు నెలవుగా పట్టణం



అయోధ్యపురం వద్ద నిర్మాణంలో ఉన్న వ్యాగన్ షెడ్

కాజీపేట రూరల్: హైదరాబాద్-వరంగల్ నేషనల్ హైవే, హైదరాబాద్ -న్యూఢిల్లీ గ్రాండ్ ట్రంక్ రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న కాజీపేట సిటీ రైల్వే హబ్‌గా మారనుంది. రైల్వే ప్రాజెక్టులు, మూడో రైల్వే లైన్, రైల్వే యూనిట్ల కార్యాలయాలు, నష్కల్-హసన్‌పర్తి వరకు ధర్మసాగర్ బైపాస్ మీదుగా గూడ్స్ రైల్వేలైన్‌తో రైల్వే హబ్‌గా రూపాంతరం చెందనుంది. దాదాపు 50 ఏళ్ల నుంచి ఈ ప్రాంత అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు కాజీపేట రైల్వే అభివృద్ధి కావాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాలు చేశారు. కాజీపేట రైల్వే అభివృద్ధికి జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు ఎన్నో ఉద్యమాలు చేసి కాజీపేటను ఢిల్లీలోని పార్లమెంట్ వరకు తీసుకెళ్లి నిలబెట్టారు.

రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ..

2012లో అప్పటి రైల్వే మంత్రి మమతబెనర్జీ పీపీపీ విధానంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను మంజూరు చేశారు. అనేక కారణాల వల్ల కొంత కాలం కాలయాపన తర్వాత వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌గా అనౌన్స్ చేశారు. కొంత కాలం తర్వాత వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ప్రకటించి 2023లో ప్రధాని మోదీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఒక వైపు రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ పనులు వేగంగా జరుగుతుండగా.. మరో వైపు కాజీపేట వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటు వ్యాగన్ షెడ్ నిర్మాణం చివరిలో ఉండగానే మరో వైపు కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ వచ్చింది. దీంతో ఎంతో కాలం నుంచి కాజీపేట ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని నిరాశతో ఉంటున్న ప్రజలు, రాజకీయ నాయకులు సంతోషంలో ఉన్నారు. ఎందుకంటే కాజీపేటలో ఎక్కువ శాతం రైల్వే పిల్లలు ఐటీఐ చేసినా ఈ ప్రాంతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారు. ఈ తరుణంలో జిల్లా ప్రజలకు డబుల్ ధమాకా మాదిరి వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు దారులు పడడంతో కొంత వరకు నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చిన్న పరిశ్రమలు వస్తాయని, కాజీపేట ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సర్వేకు గ్రీన్ సిగ్నల్

కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్‌కు సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్ నిర్మాణానికి సంబంధించి రైల్వే ప్రాజెక్టులకు సర్వే చేపట్టే ఒక ప్రముఖ సంస్థకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. త్వరలో వ్యాగన్‌షెడ్ స్థలంలో డ్రోన్ కెమెరాలతో కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్‌కు సంబంధించిన ల్యాండ్ సర్వే జరగనుందని తెలిపారు. రూ.281 కోట్లతో నిర్మించ తలపెట్టిన కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌కు సంబంధించి ఇప్పటికే రూ.66 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ, వందే భారత్ కోచ్‌లను ఇక్కడ తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- పాఠశాలల క్రీడల సమాఖ్య ఎంపిక పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ స్పోర్ట్స్: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పాఠశాలల క్రీడల సమాఖ్య అండర్-19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు పాల్గొననున్న ఈ పోటీలు రెండు దఫాలుగా నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. మొదటి రోజు పోటీలను కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించి మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే సమాజంలో గుర్తింపుతో పాటు క్రీడా కోటాలో ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. క్రీడల్లో రాణిస్తే కలిగే ప్రయోజనాలను పాఠశాలలు, కళాశాలల బోర్డులపై ప్రదర్శించాలని చెప్పారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించినట్లు హనుమకొండ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. 26న ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, అథ్లెటిక్స్, వరంగల్ ఓసిటీలో జూడో క్రీడాంశాలలో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్, బోనోఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్ తప్పనిసరిగా కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ డీఐఈఓ గోపాల్‌రావు, డాక్టర్ శ్రీధర్, వెంకట్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్, పీడీలు బరుపాటి గోపి, కోట సతీశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ డీఎస్‌ఏ కోచ్‌లు కందికొండ రాజు, ఓనపాకల శంకర్, రాయబారపు నవీన్, కొత్త ప్రశాంత్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా నాలుగు ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

సికింద్రాబాద్-పాట్నా (07003) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26, నవంబర్ 2,9న తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 12 గంటలకు చేరుతుంది. పాట్నా-సికింద్రాబాద్ (07004) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 28, నవంబర్ 04,11వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 22.30 గంటలకు చేరుతుంది. మౌలాలి-ముజఫర్‌పూర్ (07649) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 28, నవంబర్ 4,11వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 18.45 గంటలకు చేరుతుంది. ముజఫర్‌పూర్-లింగంపల్లి (07649) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 30, నవంబర్ 11, 13వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 21.00 గంటలకు చేరుతుంది. ఈ రైళ్లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్నీ, సంత్ర, ప్రయాగ్‌రాజ్, చెకి, పండిట్ దీన్‌దయాల్‌ఉపాధ్యాయ, బాక్సర్ స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాజీపేట రూరల్ : కాజీపేట-పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్యలోని అయోధ్యపురం రైల్వే గేట్ ట్రాక్ సమీపంలో శుక్రవారం ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. కాజీపేట జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి కథనం ప్రకారం.. కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన పత్తి లావణ్య (38) మానసిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు.

కాళేశ్వరం హరితహోటల్ మేనేజర్‌కు ఎక్సలెంట్ అవార్డు



ప్రశంస పత్రం అందుకుంటున్న సురేశ్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని టూరిజంశాఖ హరితహోటల్ మేనేజర్ జక్కం సురేశ్‌కు టూరిజం శాఖ ఎక్సలెంట్ అవార్డును అందజేశారు. విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి(ఐపీఎస్) శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని సురేశ్‌కు అందజేశారు.

అరుణాచలానికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్ సౌకర్యం కల్పించినట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. నవంబర్ 15న కార్తీక పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణకు వెళ్లనున్న భక్తుల కోసం ఏర్పాటు చేసి ఈ బస్ నవంబర్ 13న హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతుందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. 13న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బయలుదేరి 14న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేసుకుంటుందని, అక్కడి నుంచి మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు వెల్లూరుకు చేరుకుంటుందని, మహాలక్ష్మి అమ్మవారి దర్శన అనంతరం బయలుదేరి రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ అనంతరం తిరుగు ప్రయాణంలో 15న అరుణాచలంలో బయలుదేరి 16న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందని, దర్శనానంతరం బయలుదేరి హనుమకొండకు చేరుకుందని తెలిపారు. చార్జీలు పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో, ఆర్టీసీ బుకింగ్ కౌంటర్లలో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 9959226056, 9494107944 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెచ్ఎం దుర్మరణం

- భార్య, మనవడికి గాయాలు



ఆగయ్య (ఫైల్)

లింగాలఘణపురం: హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారిపై నెల్లుట్ల బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ పెంచాల ఆగయ్య (80) దుర్మరణం చెందాడు. ఆగయ్య, అతడి భార్య సరోజన, మనవడు దుర్గాప్రసాద్, డ్రైవర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి వరంగల్‌కు కారులో వెళ్తుండగా నెల్లుట్ల బ్రిడ్జి సమీపంలో ఆగిఉన్న కారును వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో ఆగయ్య అక్కడికక్కడే మృతి చెందగా సరోజనకు కాలు విరిగింది. అదేవిధంగా మనవడు దుర్గాప్రసాద్‌కు తలకు గాయమై రక్తస్రావం కావడంతో వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రైలు ఢీకొని గేదెల మృత్యువాత



ఘటనా స్థలిలో దర్యాప్తు చేస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని

మహబూబాబాద్ రూరల్ : ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని 3 పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్తున్న ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం మధ్యాహ్నం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధి నుంచి వెళ్తోంది. ఈ క్రమంలో గడ్డిమేస్తూ ఒక్కసారిగా 3 పాడిగేదెలు పట్టాలపైకి వచ్చాయి. దీంతో రైలు ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు. వెంటనే రైలు లోకో పైలట్ స్థానిక రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఇంజనీరింగ్ జేఈ సైదానాయక్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రైలు చక్రాలు, ఇతర ప్రాంతాల్లో చిక్కుకున్న గేదెల కళేబరాలును తొలగించారు. ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆ మార్గంలో తరచూ మూగజీవాలు రైళ్ల కిందపడి మృత్యువాత పడుతున్నాయని, పట్టాలకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

2 నుంచి రామప్పలో ప్రత్యేక పూజలు



ఓంకారం అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి వారు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు రామప్ప ఆలయ ప్రధాన పూజారి కోమల్లపల్లి హరీశ్‌శర్మ శుక్రవారం తెలిపారు. రోజూ ఉదయం గణపతి పూజ, స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 10గంటల తర్వాత అర్చన పూజ నిర్వహిస్తామన్నారు. కార్తీకమాసం సందర్భంగా నెలవారీ అభిషేకం చేయించుకునేవారు రూ.1116 చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. భక్తులు హిందూ సంప్రదాయ ప్రకారం వస్త్రాలు ధరించి పూజలకు హాజరు కావాలని కోరారు.

అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి





మాట్లాడుతున్న కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీవిద్మహే, ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీవిద్మహే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ
- ఆర్ట్స్ కళాశాలలో పీడీఎస్‌యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ

కేయూ క్యాంపస్ : విద్యార్థులు సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం యూనివర్సిటీ ఆర్ట్స్ సైన్స్ కళాశాల ఆడిటోరియం గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ సభలో వారు ప్రధాన వక్తలుగా పాల్గొని మాట్లాడారు. పీడీఎస్‌యూ 1974లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి జంపాల, చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో ఆవిర్భవించి దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకించి ప్రభుత్వాలను గద్దె దింపిన చరిత్ర పీడీఎస్‌యూకు మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా కుల వివక్ష, అంటరానితనం, మహిళలపై లైంగికదాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రాణాలను ఎదురొడ్డి నిలబడిన యూనియన్ పీడీఎస్‌యూ అన్నారు. అనంతరం కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్ దినేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు దేశ విద్యారంగంలో అమలు చేయడంతో విద్యార్థులకు సామాజిక స్పృహ లేకుండా పోతోందని, కార్పొరేట్ విద్యావ్యవస్థ పెరిగి కేవలం విద్యార్థులు బహుళ జాతి సంస్థలకు సేవకులుగా మారి పనిచేస్తున్నారన్నారు. ఈ సభలో పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాపరెడ్డి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు, జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు ఇ. విజయ ఖన్నా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సరళ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీశ్, గణేశ్, సైదులు, ఓయూ నాయకుడు సుమన్, పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, మిశ్రిన్ సుల్తానా, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాచకొండ రంజిత్, వంశీ, కేయూ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

తొలుత హనుమకొండలోని ప్రొఫెసర్ జయశంకర్ ఏకశిలా పార్కు నుంచి వేలాదిమంది విద్యార్థులతో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాళోజీ జంక్షన్, అమరవీరుల జంక్షన్, సుబేదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్‌కాలేజీ ఆడిటోరియంలో సభ నిర్వహించారు.

ఓహెచ్ఈలో సాంకేతిక లోపం

- మానుకోటలో నిలిచిన పలు రైళ్లు



మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నిలిచిన కోర్బా రైలు

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం: ఓహెచ్ఈలో (ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్) సాంకేతిక లోపం కారణంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్ శివారులో శుక్రవారం పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో వరంగల్ వైపునకు వెళ్తున్న గూడ్సు రైలు కేసముద్రం స్టేషన్ శివారులో ఉదయం 8 గంటలకు నిలిచిపోగా.. మరొక ఇంజన్ వచ్చిన తర్వాత 9.15 గంటలకు యథావిధిగా వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో కొచువేలి నుంచి కోర్బా వెళ్తున్న కోర్బా ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.20 గంటలకు మహబూబాబాద్ చేరుకున్నాక స్టేషన్‌లో 9.35 వరకు నిలిచింది. దాని వెనుక వచ్చిన భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న సింగరేణి రైలును అనంతారం మోడల్ స్కూల్ సమీపాన ఆపాల్సి వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

రూ.50 వేలు పోగొట్టుకున్న విద్యార్థి

- పోలీసులకు ఫిర్యాదు



బాధితుడు సాయిశశాంక్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎంబీబీఎస్ సీటు ఫీజు కోసం బ్యాంకులో డీడీ తీసేందుకు వెళ్తున్న టి.సాయిశశాంక్ అనే విద్యార్థి తన ప్యాంట్ జేబులో నుంచి రూ.50వేలు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌కు చెందిన శ్రీకాంత్, శ్రీదేవి దంపతుల కుమారుడు సాయిశశాంక్ తల్లిదండ్రులతో కలిసి స్థానిక గ్రామపంచాయతీ సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. కాగా, ఎంబీబీఎస్ సీటు కోసం ఘన్‌పూర్ ఎస్‌బీఐలో డీడీ తీసేందుకు తన ప్యాంట్ జేబులో రూ.500 నోట్లు రెండు కట్టలు మొత్తం రూ.లక్ష పెట్టుకుని ఇంటివద్ద నుంచి శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరాడు. బ్యాంకు వద్దకు వెళ్లిన సమయంలో జేబులో నుంచి రూ.50 వేలు పోయినట్లు గుర్తించాడు. వెంటనే తల్లిదండ్రులకు తెలుపగా అందించగా వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. కాగా, ఎంబీబీఎస్ ఫీజు చెల్లించడానికి వెళ్తుండగా డబ్బులు పోయాయని, ఎవరికైనా దొరికితే ఇవ్వాలని, ఇందుకు తగిన పారితోషికం ఇస్తామని బాధితులు కోరుతున్నారు.

పత్తి ధరల తగ్గింపుపై రైతు సంఘం ఆందోళన

- గంట పాటు కొనుగోళ్లు, కాంటాలకు అంతరాయం




రైతు సంఘం ఆందోళనతో నిలిచిన పత్తి కొనుగోళ్లు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధరలు లభించడం లేదని ఆరోపిస్తూ రైతు సంఘం నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం కన్వీనర్ మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడిపై 50శాతం లాభంతో ధర నిర్ణయిస్తే పత్తికి క్వింటాల్‌కు రూ.11వేలు మద్దతు ధర ఉంటుందన్నారు. కానీ ప్రభుత్వం మొక్కుబడిగా రూ.7,521 నిర్ణయించిందన్నారు. మార్కెట్‌లో వేలంలో రూ.7వేలు పాడి రైతులకు రూ.6వేలు చెల్లిస్తూ వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. సీసీఐ కేంద్రాలతో కొనుగోళ్లు చేయిస్తే కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 లభిస్తుందన్నారు. కాగా, ఆందోళనతో సుమారు గంట పాటు కొనుగోళ్లు, కాంటాలు నిలిచాయి. ఈవిషయం తెలిసిన వెంటనే చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, మార్కెట్ కార్యదర్శి నిర్మల, అధికారులు పత్తి యార్డు వద్దకు వచ్చి రైతు సంఘం నాయకులతో చర్చలు జరిపారు. అకాల వర్షాలతో పత్తిలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల సీసీఐ కొనుగోళ్లు చేయడం లేదని, తేమను 18శాతం వరకు పెంచి సీసీఐతో కొనుగోళ్లు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు లేఖలు రాసినట్లు రవీందర్‌రెడ్డి వివరించడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి పి.నిర్మలకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాషిపాక రమేశ్, బాల్నుకుని నర్సయ్య, కె.సంపత్, శ్రీనివాస్, ఎస్‌రెడ్డి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- తమిళనాడులోని కర్పంగం అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ చలపతి



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం

ఏటూరునాగారం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తమిళనాడులోని కర్పంగం అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్స్‌లర్ చలపతి అన్నారు. నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ న్యూఢిల్లీ బృందం శుక్రవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలను పరిశీలించింది. దేశవ్యాప్తంగా కాలేజీల్లో నాణ్యతా ప్రమాణాలపై ఇచ్చే గుర్తింపు ప్రక్రియలో భాగంగా నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) బృందం కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు, అవలంబిస్తున్న విధానాలను పరిశీలించింది. అనంతరం చలపతి మాట్లాడుతూ విద్యాలయం విద్యార్థులందరికీ ప్రయోగశాల అని, వారి ఉజ్వల భవిష్యత్ ఇక్కడి నుంచే మొదలవుతుందన్నారు. అందుకే వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. కాగా, కళాశాలలోని సదుపాయాలు, బోధన పద్ధతులపై రూపొందించిన నివేదికను సీల్డ్ కవర్ బెంగళూరులోని ఎన్ఏఏసీ ప్రాంతీయ కార్యాలయానికి పంపారని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఏఏసీ సభ్యులు నారాయణ ప్రసాద్, సుధాకర్, షేత్ జేన్, గురుకుల సొసైటీ ఓఎస్డీ సతీశ్, నీరజ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.